# మానవుడు సంకల్పరహితుడైనప్పుడే శాంతిని పొందగలడు

ప్రేమస్వరూపులారా!

మానవునకు శాంతికి మించిన తపస్సు మరొకటి లేదు. తపస్సు అనగా ఏమిటి? భయంకరమైన అరణ్యములో ప్రవేశించి ఆకులలములు తిని నిద్రాహారములు మాని స్మరించటము తపస్సు కాదు. నిజమైన తపస్సు శాంతియే! దుష్టభావములు మానవునియందుండినంతవరకు దుఃఖమునకు హేతువు అవుతుంది

**దుష్టసంకల్పములచేత దుఃఖితుడగును**<br>
**సత్యసంకల్పముచేత సాధువగును**<br>
**సకల సంకల్పశూన్యుడే శాంతినొందు**<br>
**సత్యమును తెల్పు బాట శ్రీసాయి మాట.**

ఈనాటి మానవుడు తృష్ణచేతనే దుఃఖమునకు గురి అవుతున్నాడు. వాంఛలే మానవుని దుఃఖములో ముంచుచున్నవి. ఈ వాంఛలకు ఒక పరిమితి ఉన్నది. సర్వకర్మలు భగవత్ప్రీత్యర్థముగా చేసినప్పుడు యిట్టి వాంఛలే వాంఛారహితంగా మారతాయి. కనుక, మానవుడు సంకల్పరహితుడైనప్పుడే శాంతిని పొందగలడు. 'శాంతితుల్యం తపోనాస్తి' శాంతముకంటే తపస్సు మరొకటి లేదు. 'న సంతోషం పరంసుఖం'. సంతోషముకంటె మరొక సుఖము లేదు ఈ జగత్తులో. కనుక సంతోషము కావాలనుకున్నప్పుడు శాంతిని పొందాలి.

**ఈ ప్రపంచమంతయు దైవస్వరూపమే!**

ఈ సృష్టియందు మనకు కనిపించే అనేక రూపనామములు ఏకత్వముయొక్క ప్రతి

sri sathyasaivachanamrutam

బింబములే! ఈ అనేకత్వము ఏకత్వముయొక్క అభివ్యక్తమే! ఈ ఏకత్వము, భిన్నత్వము రెండుకాదు. ఒకే వస్తువుయొక్క రెండు ముఖములే! ఈ ప్రపంచమంతయు దైవస్వరూపమే! సమస్త సృష్టికి మూలకారకుడు భగవంతుడే! ఈ సృష్టియందు తాను ఒక నటునిగా ప్రకటిస్తున్నాడు. ఇందులో నాయకుడు, నటుడు రెండూ ఒక్కడే! తానే అనేక స్వరూపములు ధరించి ఒక్కొక్క స్వరూపములో ఒక్కొక్క ప్రబోధలు సల్పుతూ వస్తుంటాడు. 'సహస్రశీర్షాపురుషః సహస్రాక్ష సహస్రపాత్'. అన్ని రూపములు భగవంతుని రూపములే! నిన్ను తెగడినా, నిన్ను పొగడినా వారిని కేవలము పరులని భావించరాదు. నిన్ను పొగడునది, తెగడునది దైవమే! ఒక రూపములో నిన్ను పొగడుతుంటాడు. మరొక రూపములో నిన్ను తెగడుతుంటాడు. ఒక రూపములో నిన్ను మెచ్చుకుంటాడు. మరొక రూపములో నిన్ను నొప్పిస్తాడు. కేవలము రూపనామములు చూచి భ్రమించి పరులు తనను నిందిస్తున్నారని, వర్ణిస్తున్నారని సుఖదుఃఖములతో కాలము గడుపుతున్నాడు మానవుడు. కానీ, వర్ణించునదీ భగవంతుడే, నిందించునది భగవంతుడే! ఇట్టి సత్యమును మనము గుర్తించినప్పుడు మానవత్వములో నుండిన ఏకత్వము మనము తెలుసుకోటానికి వీలవుతుంది. రూపనామములు వేరు కావచ్చు. భావప్రవర్తనలు వేరు కావచ్చును. ఆకారవికారములు వేరు కావచ్చు. కానీ, అన్నింటివెనుక మరుగు భగవంతుడే! తాను మరుగుగా ఉండి బాహ్య ప్రపంచములో వివిధ వ్యక్తులుగా నటిస్తూ తాను ఈ జగత్తును నడిపిస్తూ ఉంటున్నాడు. పాత్రధారి, సూత్రధారి రెండు భగవంతుడే! కేవలం పాత్రధారిగా గోచరిస్తున్నాడే గానీ సూత్రధారిగా నీకు గోచరించటంలేదు. సూత్రధారియే లేక పాత్రధారి తన నటన చక్కగా నిర్వర్తించలేడు.

**ఈ జగత్తునందు మనకు గోచరించే ప్రతి పదార్థము భగవంతుని దివ్యస్వరూపమే!**

అనేకత్వమునకు ఏకత్వమే మూలాధారము. ఈ ఏకత్వమే లేక అనేకత్వము గోచరించదు. కానీ కొందరు మూర్ఖులు జగత్తును మాత్రమే చూస్తున్నారు. జగత్తే ముఖ్యమని భావిస్తున్నారు. కానీ, ఈ జగత్తునకు ఆధారంగా బింబము ఒకటి ఉన్నదనే సత్యమును గుర్తించుకోలేకపోతున్నారు. వెనుకనున్న బింబముయొక్క ప్రతిబింబమే ఈ జగత్తుయొక్క



sri sathyasai vahamrutam

ఆకారము. బింబము లేక ప్రతిబింబము లేదు. ప్రతిబింబము ఉన్నది అంటే దీనికి బింబము ఆధారముగా వెనుక ఉన్నది. బింబప్రతిబింబములు రెండు అన్యోన్య ఆశ్రయములు, అవినాభావ సంబంధములు. దీనిని పురస్కరించుకొనియే 'మమైవాంశో జీవలోకే, జీవభూతస్సనాతనః' అందరు నా అంశమేయని భగవంతుడు చెబుతూ వచ్చాడు. కనుక మనకు గోచరించే ఈ ప్రపంచమందు ప్రతి ఆకారముకూడను, ప్రతి స్వరూపముకూడను ప్రతి పదార్థము భగవంతునియొక్క దివ్యస్వరూపములే! ఈ సత్యమును మనము గుర్తించుకొనలేక ఒకరు నాకు విరోధియని, ఒకరు నాకు మిత్రుడని మరొకడు శత్రువు అని ఈ విధముగా కోపతాపములతో కాలమును వ్యర్థము గావించుకుంటున్నాము. ఇట్టి ఏకత్వము పరమాత్మభావముతోనే మనకు లభ్యమవుతుందిగానీ దేహాత్మభావముతో మనకు లభ్యము కాదు.

**ప్రేమస్వరూపుడైన పరమాత్ముని ప్రేమద్వారానే దర్శించటానికి వీలవుతుంది**

ఈనాటి మానవుడు క్షణక్షణము దేహాత్మభావముచేత తన కాలమును, కాయమును, కర్మను వ్యర్థము చేసుకుంటున్నాడు. పరమాత్మభావమును విస్మరిస్తున్నాడు. కనుకనే దుఃఖమునకు, కష్టమునకు, నష్టమునకు విచారమునకు తాను గురి అవుతున్నాడు. దైవత్వమును మనం గుర్తించవలెనన్న, దివ్యత్వమును మనం అనుభవించవలెనన్న లోకసంబంధమైన వ్యాపారముచేత మనము తెలిసికొనలేము. భగవంతుడు ప్రేమస్వరూపుడు. ప్రేమయే తాను. తానే ప్రేమ. కనుక, తన ప్రేమను సర్వులయందు ప్రతిబింబింపచేసేదానికి నిర్మలమైన, నిశ్చలమైన హృదయాన్ని అనుగ్రహించాడు. భగవంతుడు తన ప్రేమను ఏవిధంగా పంచుతున్నాడో అదే విధంగా ప్రతి మానవుడు తన ప్రేమను సర్వులకు పంచాలి. అప్పుడే ఏకాత్మభావము అర్థమవుతుంది. పరమాత్మను మనము తెలుసుకొనవలెనంటే ధనముతో కొనుటకు వీలుకాదు. లేక యుక్తి కుయుక్తులతోగానీ, శక్తితోగానీ, పదవులతోగానీ, విద్యతోగానీ మనము పొందలేము. నీ తెలివితేటలు, నీ శక్తిసామర్థ్యములు కేవలము ప్రాకృతమైనవేగానీ పరతత్త్వమునకు ఏమాత్రము సంబంధించినవికావు. ప్రకాశించే చంద్రుని చూడవలెనన్న

srisathyasaivachanamrutam

ఏ టార్చిలైటో, ఏ పెట్రోమాక్సులైటో, హరికెన్‌లాంతరో తీసుకుపోయి చూచుటకు వీలుకాదు. ఆ చంద్రుని ప్రకాశముద్వారానే చంద్రుని చూడవలసి వస్తుంది. అదే విధముగా ప్రేమస్వరూపుడైన పరమాత్ముని చూడవలెనన్న ప్రేమచేతనే చూచుటకు వీలవుతుందిగానీ మరొకదానితో ఏమాత్రము సాధ్యముకాదు. ప్రేమ ఒక దిక్సూచియంత్రము వంటిది. ఈ దిక్సూచి ఎక్కడపెట్టినా అది ఉత్తరదిశవైపే తిరుగుతుంది. అదే విధముగా మానవునియొక్క ప్రేమ ఎట్టి పరిస్థితులందైనా పరమాత్మవైపునే తిరగాలి. ప్రకృతివైపున తిరిగే స్వభావము దీనికి సరైనది కాదు. ప్రతి మానవుని ప్రేమతత్వము భగవంతునివైపు మరల్చాలి. ఇట్టి దివ్యమైన భగవత్స్వరూపము సర్వులయందును ప్రకాశిస్తూనే ఉన్నది. 'నేను వేరు, దైవము వేరు' అనే భేదభావమును దూరము చేయాలి. ఆ రూపములో ఉండినదికూడా ఈ రూపములో నుండిన దైవమే! రూపములు వేరు కావచ్చు, నామములు వేరు కావచ్చును, పరిస్థితుల ప్రభావము వేరు కావచ్చు, కానీ పరతత్త్వము మాత్రము ఒక్కటే!

### నీ తత్త్వమును నీవు గుర్తించటమే నీ ప్రధాన లక్ష్యము

భక్తియోగము, జ్ఞానము అని అనేక విధములైన మార్గములు బోధిస్తుంటారు, భగవంతుని చేరటానికి. భక్తి అనగా కేవలము శృతిలయరాగతాళములతో భజన చేయటము కాదు. యోగము అనగా మూలకూర్చుని ముక్కు మూసుకోటం కాదు. జ్ఞానమనగా అనేక గ్రంథములను పరిచయము గావించుకొని గ్రంథపఠనముచేత జ్ఞానము పొందినామని భ్రమించటము కాదు. అన్నియు భగవంతుడు ప్రసాదించిన వర ప్రసాదములే! నీకంటె భగవంతుడు వేరుగా లేడనే సత్యము మొట్టమొదట నీవు నమ్మాలి. ఇవన్నీ ఎందుకోసం మనకందించాడు? ఒక చిన్న ఉదాహరణము. నీవు నిద్రించే నిమిత్తమై చక్కని పడకను అమర్చుకున్నావు. సీలింగుఫ్యాను బాగా తిరుగుతూ ఉంటున్నది. ఏసీకూడా చక్కగా పనిచేస్తున్నాది. పరుపు, దిండు అన్ని అనుకూలముగా ఉన్నాయి. కానీ నీకు మాత్రం నిద్ర రావటం లేదు. నిద్రను కల్పించని యీ ఫ్యాను మనకెందుకు? నిద్రను కల్పించని యీ ఏసీ మనకెందుకు? నిద్రను కల్పించని పరుపులు ఎందుకు? అదే విధముగా ఈ జగత్తులో సమస్త

srisathyasaivachanamrutam

పదార్థములుకూడను దైవప్రేమను అనుభవించే నిమిత్తము నీకు అందించినాడు. నీ స్థితి, నీ మతి, నీ గతి, నీ సంపత్తి యివన్నీ కేవలము దైవప్రేమ అనుభవించే నిమిత్తమై భగవంతుడు అందించిన వరప్రసాదము. ఇట్టి ప్రేమతత్త్వాన్ని అందించని మన స్థితి, గతి, సంపత్తి, మనకెందుకు? ప్రతి మానవుడు మతి, గతి, స్థితి, సంపత్తి యివన్నీ భగవంతుని పొందే నిమిత్తము భగవంతుడే అందించిన ప్రసాదములుగా భావించాలి. ఈనాడు మానవులు ప్రపంచములో అనుభవించవలసినవి ఎన్నో ఉన్నవని భ్రమిస్తున్నారు. ఇవి కేవలము వట్టి భ్రమమాత్రమే! నీ తత్త్వమును నీవు గుర్తించటమే నీ ప్రధాన లక్ష్యము.

**మానవుడు అన్నిటిని విశ్వసిస్తున్నాడుగాని, దైవమును విశ్వసించటంలేదు**

> **దేవుడనగ వేరు దేశమున లేడు**
> **దేవుడుండు తనదు దేహమందె**
> **పాపమనగ వేరు పరదేశమున లేదు**
> **తానుచేయు పనుల తగిలియుండు**

ప్రతి పనియందు ఈ ప్రతిధ్వనిగానీ ప్రతిబింబముగానీ ప్రతిక్రియగానీ దైవముయొక్క సంకల్పములే! ఈ సత్యమును మొట్టమొదట విశ్వసించాలి. కానీ దురదృష్టవశాత్తు ఈనాటి మానవుడు అన్నింటిని విశ్వసిస్తున్నాడు కానీ దైవమును విశ్వసించటంలేదు. బజార్లోపోయే బికారి సాముద్రికముచూసి చెప్పినప్పుడు దాన్ని మనం విశ్వసిస్తున్నాము. పంచాంగ బ్రాహ్మణుడు ఏమి చెప్పినా దాన్ని మనం విశ్వసిస్తున్నాము. క్యాలండరులో చూచి ఈనాడు గురువారమని విశ్వసించి గురువారవ్రతం చేస్తున్నాం. గురువారం అనేది నీకు ఎట్లా తెలిసింది? క్యాలండరు చూసి నీవు చెబుతున్నావు. సిద్ధాంతి వ్రాసిన క్యాలండరు చూచి గురువారమని చెబుతున్నావు. సిద్ధాంతి చెప్పిన మాటలు విశ్వసిస్తున్నావు గానీ 'అహం బ్రహ్మాస్మి', 'తత్త్వమసి', 'ప్రజ్ఞానం బ్రహ్మ', 'అయమాత్మ బ్రహ్మ' అని పవిత్రమైన వేదము బోధించినదానిని విశ్వసించలేకపోతున్నావు. 'అహం బ్రహ్మాస్మి', నేనే బ్రహ్మ అనే దాన్ని విశ్వసించలేకపోతున్నావు. నీదికాని ఆస్తిపాస్తులను 'నాది, నాది' అని విశ్వసిస్తున్నావు. యిది ఎంతకాలము ఉండేవి? ఎవరివి? వచ్చేటప్పుడు తెచ్చావా? ఏమీలేదు. వచ్చినప్పుడు యింత

srisathyasaivachanamrutam

బట్టైనా చుట్టుకొని రాదు, పోయే సమయములో ఎడ్రస్సు అయినా యిచ్చిపోడు. ఈ మధ్యకాలములో అన్ని 'నాది, నాది' అనుకోటమే పెద్ద అజ్ఞానము. అంతా దైవమే!

## భగవంతుడు నీ హృదయవాసి

ఒకానొక సమయంలో సమర్థరామదాసు, తుకారాం, మీరా సమకాలికులుగా ఉండినప్పుడు భగవంతుని ఏవిధముగా పొందాలని మార్గములు వెతుకుతూ వచ్చారు. తుకారాం చెప్పాడు; 'స్వామీ! నేను జపములు చేస్తుంటే కోతివంటి మనస్సు ఎక్కడెక్కడో పరుగెడుతుంది. జపములు చేయలేను, ధ్యానము సలుపలేను, యోగము అభ్యసించలేను, గ్రంథములు చదవలేను, జ్ఞానము పొందలేను. కానీ ఒక్కటి మాత్రం నా దగ్గర శాశ్వతంగా ఉంటున్నది. ప్రేమ ఒక్కటి మాత్రమే ఉంటున్నాది. ఈ పవిత్రమైన ప్రేమచేత నిన్ను కట్టివేయగలను. మరొక దీనితో నిన్ను కట్టలేము. ప్రేమకే నీవు వశుడౌతావు'. జ్ఞానమంటే తెలియనివారు అనేక విధములుగా గ్రంథపరిచయముచేత బోధిస్తుంటారు. జ్ఞానము, యోగము, ధ్యానము, తపము యివన్నీకూడను మనస్సుయొక్క ఆధారముతో సల్పేవే! మనసే ఒక పిచ్చి కోతి. దానితో సలిపే సాధనలు పిచ్చివి గాక మంచివి అవుతాయా? మనస్సు ప్రక్కకునెట్టి హృదయమును విశ్వసించి, ఆనందమును నీవు అభివృద్ధి గావించుకోవాలి. భగవంతుడెక్కడ ఉంటున్నాడు? నీ హృదయవాసి. ద్రౌపది నిండు సభలో తనకు అవమానములు జరుగుతున్న సమయంలో 'హే ద్వారకవాసా' అన్నాది. 'బృందావనవిహారి మధురాపురసంచారీ' అన్నది. కానీ భగవంతుడు కృష్ణుడు ప్రత్యక్షముకాలేదు. అలసిపోయింది. నిశ్శక్తితో ఉన్నప్పుడు 'హృదయవాసి' అని పలికింది. హృదయవాసి అనేటప్పటికి ప్రత్యక్షమయ్యాడు. స్వామీ! యింతవరకు నేను ఎన్నో విధములుగా ప్రార్థించాను, వర్ణించాను. కానీ, నీవు నాకు కనిపించలేదు. 'హృదయవాసి' అని అంటే కనిపించావు. దీనిలోని అంతరార్థము ఏమిటి? అంది. 'ద్రౌపదీ! భక్తుని పలుకులే నన్ను దూరము చేస్తున్నవి. భక్తుని పలుకులే నన్ను సమీపానికి తెస్తున్నాయి. ద్వారకావాసీ అంటే నేను ద్వారకకు పోయిరావాలి, నీ మాట సత్యముగా నిరూపించాలి. నీ మాటకు విలువ యివ్వాలికదా! ద్వారకపోయి వస్తున్నాను కాబట్టి ఆలస్యమైంది. బృందావన సంచారీ



sri sathyasai vachanamrutam

అంటున్నావు. నేను తిరిగి బృందావనం పోయి రావాలి. మధురాపురవిహారి అంటున్నావు. నేను మధురపోయి తిరిగి రావాలి. అక్కడకు పోయి రావటానికి ప్లేనులున్నాయా? ఏమీ లేవు. కాబట్టి ఆలస్యమవుతున్నాది. హృదయవాసి అన్నావు. దగ్గరనే ఉన్నాను కదా. హృదయవాసి అయిన నన్ను ద్వారకవాసి అని ద్వారక పంపుతున్నావు. ఇది నీ దోషమేగానీ నా దోషము కాదు. మధురాపురవిహారి అన్నావు, నన్ను మధురకు పంపుతున్నావు. నా మధుర నీ హృదయమే!' అని తెలియజేసాడు. ప్రతి మానవుని హృదయముకూడను భగవంతుని నివాస స్థానమే! అట్టి మూలస్థానమునందున్న భగవంతుని మనము గుర్తించుకొనలేక అతనిని దూరముగా పంపి తిరిగి మన ప్రార్థనచేత సమీపమునకు తెప్పించుకుంటున్నాము.

### ప్రతి వ్యక్తియందున్న చైతన్యమే దైవత్వము

మొట్టమొదట దైవత్వమనేది ఏమిటో గుర్తించుకోవాలి. ప్రతి వ్యక్తియందున్న చైతన్యమే దైవత్వము. చేతనాశక్తియే దైవత్వము. ఈ చేతనాశక్తి లేనివ్యక్తి జగత్తులో కానరాడు. దైవమును వేదములు 'ప్రజ్ఞానం బ్రహ్మ' అన్నాయి. ప్రజ్ఞానమనగా చేతనాశక్తియే! మార్పు చెందేదికాదు. కూర్పు చెందేదికాదు. కాలిపోయేదికాదు. కూలిపోయేదికాదు. మారేదికాదు. నిరంతరము నిశ్చలంగా, నిర్మలంగా, నిస్స్వార్థంగా ఉండేది. ఈ ప్రేమతత్త్వమునే వేదములు ఆత్మ అని పిలుస్తూవచ్చాయి. ఆత్మాన్వేషణ నిమిత్తమై అనేకమంది ఋషులు అనేక మార్గములలో వెతికి అలసిపోయి కట్టకడపటికి 'యిదికాదు, యిదికాదు', అన్నారు. ఒక్కతూరి హృదయములోనికి చూచారు. 'వేదాహమేతం పురుషం మహాన్తం ఆదిత్యవర్ణం తమసః పరస్తాత్'. తమస్సుకు ఆవల భగవంతుడు కనిపిస్తాడు. ఆత్మతత్త్వము తమస్సుతో కూడినదికాదు. మొద్దుగా మొండి బారినది కాదు. లేక సాత్త్వికముకూడా కాదు. రాజసికముకూడా కాదు. దీనిలో ఉద్రేకము, ఉత్సాహము ఏమాత్రము లేవు. రాకపోకలులేని దివ్యతత్త్వము, ఈ ఆత్మతత్త్వము. అదే నిరంతరము ఆనందమయమైన తత్త్వము. అట్టి ఆనందము తనయందే ఉంటున్నది. అట్టి సత్యము నీయందే ఉంటున్నది. కనుక మనము సత్యాన్వేషణ సలుపనక్కరలేదు. 'ఏకం సత్ విప్రాః బహుధా వదంతి'. ఉన్నది ఒక్కటే,

sri sathyasai vahini

రెండవది లేదు. అలాంటి సత్యము నీవే. నీవే సత్యము. అట్టి దివ్యమైన భావము గట్టిగా విశ్వసించి నీవు అనుభూతిలో పెట్టినప్పుడే సత్యస్వరూపము నీకు గోచరిస్తుంది. కానీ, దేహాత్మభావమును విశ్వసించి పరమాత్మతత్త్వమును విస్మరించి ఆత్మాన్వేషణ చేస్తే ఏ విధంగా గోచరమవుతుంది?

**దేహమే నేననుకోవటంచేత దోషములకు గురవుతున్నారు**

ప్రేమస్వరూపులారా! దీనిని నోటితో వర్ణించటమనేది కట్టిపెట్టండి. హృదయమును తెరవండి! కానీ, ఈనాటి మానవుడు హృదయమును మూసి పెడుతున్నాడు, నోరు తెరుచుకుంటున్నాడు. కనుకనే మల్లమ్మ 'అగమ్య అగోచర అప్రమాణ అప్రతిహత' అని ఎంత గొప్పగానో వర్ణించింది. కొలనుకు తామరపుష్పమే శృంగారము. గ్రామమునకు ఇండ్లే శృంగారము. యిళ్లే లేక గ్రామమునకు శృంగారమే లేదు. ఆకాశమునకు చంద్రుడే శృంగారము. సముద్రమునకు తరంగములే శృంగారము. వ్యక్తికి గుణమే శృంగారము. ఆ గుణము ఎలాంటిది? దానినే 'నడత' అని చెబుతూ వచ్చారు. దానినే 'నీతి' అని చెబుతూ వచ్చారు. మన నిత్యజీవితములో నడిచే ప్రవర్తనలు పవిత్రంగా ఉండాలి. ఇట్టి పవిత్రమునే చరిత్ర అని పిలుస్తూ వచ్చారు. అలాంటి చరిత్రకారులుగా మీరు తయారుకావాలి. నీవే దైవము, నీయందే దైవము ఉన్నాడని నీవు విశ్వసించాలి. 'ఇది నా దేహము' అని చెప్పుకో! తప్పులేదు. కానీ, దేహము నేనని చెప్పకూడదు. అక్కడే ఈ దోషములంతా ప్రవేశిస్తున్నాయి. దేహము నేననుకోటంచేత దోషమునకు గురౌతున్నాది. 'నా దేహము' అని చెప్పు; దోషము ఏమాత్రము ఉండదు. 'ఇది నా బట్ట' అనుకుంటే పారవేయవచ్చు. 'నేనే బట్ట' అంటే ఎట్లా పారవేయుటకు వీలవుతుంది? దేహాభిమానము క్రమక్రమేణా తగ్గించుకుంటూ రావాలి. ఆత్మాభిమానము దినదినము అభివృద్ధి పొందాలి. అప్పుడే నీ జీవితతత్త్వము ఒక్క క్షణములో గోచరమవుతుంది. అది మన భావము ఎట్లా ఉంటుందో దానికి తగినట్లుగా ఉంటుంది. అన్నమాచార్య చెప్పాడు 'ఎంతమాత్రమున ఎవ్వరు తలచిన అంతమాత్రమే నీవు'. నీవు దైవము అనుకుంటే దైవముగా మారుతావు. దయ్యమనుకుంటే దయ్యముగా మారుతున్నావు. దీనుడు అనుకుంటే దీనుడుగా మారుతున్నాడు. దేవుడు అనుకుంటే

srisathyasaivachanamrutam

దేవుడుగా మారుతున్నాడు. కాబట్టి నీ తలంపులలో ఉంటున్నాయి, మంచి చెడ్డలు. దైవములో ఏమాత్రము లేవు. కాన మొట్టమొదట మన సంకల్పములు పరిశుద్ధమైన సంకల్పములుగా, పవిత్రమైన సంకల్పములుగా ఉంటుండాలి. ఈ పవిత్రము పరిశుద్ధము ఒక్క ప్రేమయందు మాత్రమే మనకు కనిపిస్తుంది.

## ఒకే భగవంతుడు ఆయా వ్యక్తుల హృదయ ప్రమాణములు పురస్కరించుకుని ఆయా రూపములలో దర్శనమిస్తున్నాడు

ఈ ప్రేమకు మించిన మరొక శక్తి లేదు. ఈ జగత్తులో ఎక్కడ చూచినా సమత్వము చూపించేది ప్రేమ ఒక్కటే! ఈ ప్రేమ పదునైన కత్తి వంటిది. దీనికి తన, పర అనే భేదములు ఏమాత్రము లేవు. అందరియందు సమత్వముగా ఉండినటువంటిది. అందరికి దైవము ఒక్కటే! కానీ ప్రతిబింబములు కనిపిస్తున్నాయి. సూర్యుడు ఉదయించినప్పుడు చెట్టుపైన పడతాడు. చెట్టుక్రింద కొంతవరకు వెలుగు, కొంతవరకు నీడ ఈ విధంగా కనిపిస్తుంది. సూర్యుడు ఒక్కడే! చెట్టుకొమ్మలు విడిగా ఉండటంవలన ఒక దగ్గిర నీడ ఒక దగ్గిర వెలుగు కనిపిస్తున్నాది. ఈ వెలుగునీడలు చెట్టుయొక్క ప్రభావముగానీ సూర్యుని దోషము కాదు. ఒకే సూర్యుడు. కానీ భిన్నభిన్నముగా కనిపిస్తున్నాడు. అదే విధముగా ఒకే భగవంతుడు వారి వారి హృదయప్రమాణములు పురస్కరించుకొని ఆయా రూపములలో దర్శనము యిస్తున్నాడు. దేవునికి అనేక రూపములున్నాయని భావిస్తున్నారు. నిజమే! అన్ని రూపములు భగవంతునికే! ఒక రూపమునకు మరొక రూపమునకు ఏమాత్రము సంబంధములేనట్లు కనిపిస్తుంది. సముద్రములోని తరంగములు వివిధ రూపములో వెడుతుంటాయి. తరంగములు వివిధరూపములలో కనిపిస్తున్నాయి గానీ, జలము ఒక్కటే! తరంగములు జలమయము కాబట్టి సముద్రము వేరుగా భావించరాదు. సచ్చిదానందములోని గుణములు యీ మానవునియందుకూడా ఉంటున్నాయి. రెండు ఒక్కటే! వేరు కాదు. ఆ సత్యమును మనము హృదయపూర్వకంగా విశ్వసించాలి.

## మనస్సును మరచి హృదయమును దృష్టియందుంచుకోవాలి!

ఒకతూరి మనకు కోపము వస్తుంది. ఒక నిముషములో అసూయ కలుగుతుంది.

sri sathyasai vachanamrutam

ద్వేషము వస్తుంది. యివన్నీ మనలో ఆవిర్భవించే గుణభేదములే గానీ దైవమువి కాదు. యివి మన మనస్సుయొక్క ప్రభావములే! కనుక, మనస్సును ఏమాత్రము ఆధారము చేసుకోవద్దు. మనస్సు అన్నింటిని ఆశిస్తుంది. మనస్సును మరచి హృదయాన్ని నీవు దృష్టియందుంచుకోవాలి. మనసంటే ఏమిటి? మన కల్పనే. మనస్సుకు ప్రత్యేక రూపములేదు. ఏ తలంపులు మనలో కలుగుతాయో ఆ స్వరూపమును మనస్సు ధరిస్తుంది. ఒక చిన్న ఉదాహరణము. మృత్యువు మనకు దుఃఖమునందిస్తున్నాదని భావిస్తున్నాము. చాలా అజ్ఞానము. మృత్యువువల్ల మనకు దుఃఖము ప్రాప్తించుటలేదు. దేహాభిమానమే మూలకారణము. మరణించిన వ్యక్తి నావాడు అనేదే దుఃఖమునకు కారణము. ఒకే బజారులో ఒక యింటిలో మృత్యువు జరుగుతుంది. మరొక యింటిలో కళ్యాణము జరుగుతుంది. కళ్యాణగృహములో అందరు కళకళలాడుతున్నారు కిలకిల నవ్వుతున్నారు. కానీ మృత్యువు జరిగిన గృహములో అందరు ఏడుస్తున్నారు. మృత్యువే దుఃఖమునకు కారణమనుకుంటే బజారు అంతా ఏడవలసిందే కదా. కాదు కాదు. 'మృత్యువు వాతపడినవాడు నా వాడు', అని అనుకోటం కారణం. దేహాభిమానమే దుఃఖమునకు కారణము.

**నూతనమైన దేహమును ధరిస్తున్నావుగాని సనాతనుడైన దైవమును విశ్వసించటంలేదు**

క్రమక్రమేణా ఈ దేహము భగంతుని మందిరము అని భావించుకోవాలి. దానికి తగిన పోషణ చక్కగా చూసుకో! అలక్ష్యము చేయవద్దు. అనారోగ్యమునకు గురికావద్దు. 'భిక్షాన్నం దేహ రక్షార్థం; వస్త్రం శీత నివారణం'. నీవు వస్త్రములు ధరించవలసిందే! ఆరోగ్యమునకు అన్నం తినవలసిందే! ఇవన్నీ నిత్యజీవితములో కర్తవ్యములుగా భావించాలి. కానీ దేహము నేను ధరించిన ఉపాధియని భావించాలి. భగవంతుని నివాసమని విశ్వసించాలి. 'దేహో దేవాలయ ప్రోక్తో జీవో దేవస్సనాతనః' నూతనమైన మందిరము ఇందులో సనాతనమైన భగవంతుడు నివసిస్తున్నాడు. ఇందులో నివసించేవాడు సనాతనుడు. దేహమా నూతనమైనది. నూతనమైన దేహము ధరించుచున్నావుగానీ సనాతనమైన దైవమును విశ్వసించటంలేదు.

**ప్రకృతి, పరమాత్మకు అంగమే!**

ప్రేమస్వరూపులారా! దేహమును అలక్ష్యము చేయకూడదు. అలాగని దేహముపైన అమితముగా ప్రేమను పెంచుకోకూడదు. నీ ప్రేమనంతా పరమాత్మపై పెట్టుకో!

**దేహము పాంచభౌతికము దేహము కూలక తప్పదెప్పుడున్**
**దేహి నిరామయుండు గణుతింపగ దేహికి చావుపుట్టుకల్**
**మోహనిబంధ బంధనల ముద్రలు లేవు నిజంబుజూడ యా**
**దేహియె దేవదేవుడు మదిన్ గణుతింపగ ఆత్మరూపుడౌ!**

దేహము ఎలాంటిది? పవిత్రమైనదికాదు. దేహిలోపల ఉండినంతవరకు పవిత్రమే! దేహి ఈ దేహమును వదలిపోతే

**మలినపు కొంప రోగముల ముగ్గెడు సేవకగంప జాతసం**
**చలనముపొందు దుంప భవసాగరమీదగలేని కంప అం**
**బుంబులపొది లెమ్ము చూడ మన మెప్పుదలంపగ దేహమింక ని**
**శ్చలమని నమ్మబోకు మనసా! హరి పాదములాశ్రయింపవే.**

నీవు హరిపాదములాశ్రయించాలి. అదే నీ ప్రధాన కర్తవ్యము. జగత్తులోనున్న సమస్త పదార్థములు నీవు వినియోగించుకో! యివన్నీ ప్రేమ పెంపొందింపచేసే సోపానములుగానే భావించు. అంతేగానీ యిది దుఃఖము, యిది సుఖము; యిది పాపము; వీడు ద్వేషి, వీడు మిత్రుడు అని భేదములకు అవకాశము యివ్వకు. ఎవరైనా దూషిస్తే ఆ రూపములో భగవంతుడు నన్నీ విధంగా దూషిస్తున్నాడు అనుకో! ఆ రూపము, ఈ రూపము రెండు అస్థిరములైనవే! ఆ రూపములో నున్నది, ఈ రూపములో నున్నది రెండు స్థిరములే! ఇట్టి ఆత్మభావము మనము పెంచుకుంటూపోవాలి. అప్పుడే మనకు శాంతి. అదే మనము చెయ్యవలసిన తపస్సు. అంతేగానీ ఆహారపానీయములు మానివేసి కేవలము ఒంటి కాలిపై నించొని బాధలు పడటం కాదు, తపస్సు. దేహమును చక్కగా పోషించుకో! దేహమునకు శక్తిని పెంచుకో! కానీ దేహశక్తిని దైవమునకు అంకితము చేయాలి. అదే కర్తవ్యము. తన కర్తవ్యమును విస్మరించి ఈనాటి మానవుడు కర్మలో మునిగి జన్మను వ్యర్థము

sri sathyasai vahanamrutam

చేసుకుంటున్నాడు. యివి చేతులు, యివి చెవులు, యివి కన్నులు, యిది నోరు, యివి కాళ్లు, యివన్నీ దేహానికి అంగములే! అయితే దేహము దేనికి అంగము? దేహము సమాజమునకు అంగము. సమాజము దేనికి అంగము? మానవత్వమునకు అంగము. మానవత్వము దేనికి అంగము? ప్రకృతికి అంగము. ప్రకృతి దేనికి అంగము? పరమాత్మకు అంగము. ప్రకృతి అంతా పరమాత్మకు అంగమే! ఇవన్నీ దేహమునకు ఎట్లా అంగములైనాయో ప్రకృతి పరమాత్మకు అంగమే! ఇట్టి ఏకాత్మ భావము మనము చక్కగా గుర్తించినప్పుడు యిదే విశిష్టాద్వైతము. ఈ విధమైన పరమాత్మ తత్త్వము తెలుసుకొని పరమానందము పొందే మార్గము నీవు వెతికి నిత్యానందుడవై జీవించు.

**(తేదీ 21-11-1996న కుల్వంత్ హాలులో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam